

# నావలో

నాగరాజామాత్యుడు

(కోటిపల్లి రేవులో)

నావవాడు : (కేక)- ఒహో ... వొయ్! నావరానీ, నావరానీ, నావరానీ! జనం కూకున్నారు.

(నావ వొడ్డుకి వస్తుంది)

నావవాడు : ఆ మొసవట్టుకో- ఆ మొస వట్టుకో - కాయి-నావ వొడ్డెక్కేసి రాళ్ళకు కొట్టుకుంటది. ఆఁ అద్గదీ- అలాగ-అలా సూత్తా వేంరా, గంగా- గెడెయ్యవేం?

గంగడు : అద్దెబ్బ, ఏం వొరదరా! వొడ్డెని కూడా గడ కందటంలేదు. నీళ్ళల్లో గడవేసినానని వొడ్డెక్కి చేరుస్తున్నాడు.

నావవాడు : ఆ తాడిలా గిరెయ్యి- అదీ- ఈ గాలి రానీ- నావ వొడ్డుని డీక్కుంటుంది- అరరే!—ఆఁ. ఎక్కండి, బాబూ, పంతులుగారు. పాపం, శానసేపు కనిపెట్టుక్కూకున్నారు. ఎక్కండమ్మా, ఎక్కండి.

పంతులు : కొంచెం పట్టుకోరా అబ్బి.

గంగ : అయ్యా- రాండి.

(నావలో జనం ఎక్కుతారు)

పంతులు: ఇంక పోనియ్యరా, బాబూ, నావ. ఈ గోదావరి దాటి మేమింకా చాలా దూరం పోవాలి.

నావవాడు : ఎందాకా యెల్లాలండి?

పంతులు : అబ్బో అమలాపురం వెళ్లాలి. కోర్టు తెరిచే వేళకి చేరగలనో లేదో!

నావవాడు : ఇదుగో ఎల్లిపోదారండి. ఏరా, గంగా?

గంగ : ఎల్లిపోదారండి. ఒక్క చణం. ఇంతలోకి కాకినాడ కారు వొచ్చేస్తది.

పంతులు : సారి, ఇంకా అదో తరవాయుందీ? అయితే ఇవాళ నేను-

(కారు కూస్తుంది)

గంగ : అదుగోనండి, కారు కూడా వొచ్చేసింది. ఎలాగండి, బాబూ, మరి మేం నాలుగు డబ్బులు సంపాదించుకోకపోతే-

నావవాడు : రండి అబ్బాయిగారు, ఆ పెట్టిలా గందియ్యండి.

పంతులు : అబ్బ, ఈ యేడేం వరద. నీళ్లు కారుస్టాండు దాకా కూడా తాసుకుపోయాయి!

(అబ్బాయి నీళ్ళల్లో నడుస్తూ వచ్చి ఒక్క గంతువేసి నావ ఎక్కుతాడు. నావ ఊగిసలాడుతుంది. ఒడుదుడుకుగా అంతా 'ఆఁ ఆఁ' అంటారు.)

పంతులు : ఏయ్, కళ్లు కనపట్టంలేదూ? నా బట్టలనిండా యీ బురద నీళ్ళన్నీ పోసేశావు?

అబ్బాయి : చూళ్లేదండి, తాతగారు క్షమించాలి. (నీళ్లల్లో కాళ్లు కడుగుతాడు)

పంతులు : మరి ఆ కళ్లెందుకు? పైగా 'తాతగారూ' అంటావు, తాతగారు. నీ మతానికి నువ్వేం ఇంకా కుర్రగుంట వనుకుంటున్నావేమిటి?

నావవాడు : సిన్నతనపండీ బాబు, ఊరు కోండి. ఏదో అవి పోయింది.

పంతులు : మరీ అంత ఒడుదుడుకా అంట? ఇంతమంది ఆడాళ్లూ, పిల్లలూ వున్నారు; పడవ మునిగిపోతేనో? ఆ మాత్రం జ్ఞానం వుండక్కర్లేదూ? మళ్ళీ చదువుకుంటోన్నట్టున్నావు?

అబ్బాయి : మళ్లీనా, మళ్లీనా—ఏం చదువు లెండి. నాకే విసుగెత్తిపోతోంది.

గంగ : పడవ మునిగిపోటాని కిక్కడ లోతు సాలదు లెండి. అయినా మేమువుండి అంతలోకి ఆలా మునిగిపోనిత్తామాండి?

పంతులు : చాల్లే, నేర్చుకుపోయావు. మునిగి పోయాక నువ్వూ నేనూ చేసేదేమి టింక?

అబ్బాయి : చూడండి అయ్యా, మరి మీ నామధేయ మేమిటోను. నేను మిమ్మల్ని క్షమాపణ కోరాను. నే నిన్ని బురదనీళ్లు తీసి మీమీద కావాలని పొయ్యలేదు——

పంతులు : అదొకటి కూడానా.

అబ్బాయి : నెల్లాళ్లనించి ఆ కాకినాడలో హోటేలు మెతుకులు కొరికికొరికి ఎప్పుడింటికి వెళ్ళిపడి మా అమ్మ వండిన శుభ్రమైన చారూ అన్నమూ ఇంత తింటానా అన్న ఆదుర్దా కొద్దీ——

పంతులు : ఆఁ అఁ. నువ్వు హోటేలు మెతుకులు తినకపోతే వుద్ధరించావు మమ్మల్ని.

నావవాడు : మీ 'కేవు'ఇప్పించం డబ్బాయి గారూ, నావిడిసిపెట్టేత్తా నింక.

అబ్బాయి : ఓహో–ఎంత?

నావవాడు : ఎంతేంటండి? మీ రెరగరేంటి, కొత్తా?

అబ్బాయి : అబ్బ, నే నెరగనులే. చెప్ప వోయ్ ఎంతోను?

నావవాడు : మా మూ లే, రెండణాలండి మనిసికి.

అబ్బాయి : (పర్సులోంచి రెండణాలు తీసి యిచ్చి) హరి–నావలకీ గోదావరికీకూడా వచ్చి పడింది కాబోలు ఈపాడు కరువు.

గంగ : మరి బియ్యపు నూకలకీ, కూరగాయ లకీ వచ్చినట్టేనుండి.

నావవాడు : ఏరా, ఇంకెవరూ రా రం టూవా?

పంతులు : ఇంకైనా పోనీరా దేవుడా, ఇం కెవరొస్తారు?

నావవాడు : అయితే, తోసేద్దావంటూవా?

అబ్బాయి: తోసేద్దామూ అంటున్నావు, మళ్లీ యీ ఊబిలో దిగి నన్ను తొయ్యమంటావేమిటి కొంపతీసి - అసలే -

పంతులు : ఇంకా ఎన్ని పాట్లున్నాయో మనకి ముందు.

అబ్బాయి : అలాగే వుందండి. మన ప్రయా ణంకూడా నా పరీక్షలాగేవుంది. ఇందాకా బస్సులోనూ అంతే -

పంతులు : బస్సులో చెయ్యవలసిందే పరీక్ష.

అబ్బాయి : అదికాదండి, నేను చెప్పబో యింది. నే నిప్పుడు కాకినాడనించి సెప్టెంబరు పరీక్షలకి వెళ్లి వస్తున్నాను. మొన్న మార్చిలో నేను ఇంటర్ ఫేలయినాను.

పంతులు : మరేం మునిగిపోలేదు.

అబ్బాయి : అదేనండి నా వాదనాను. ఈ సదభిప్రాయం మా నాన్నకుంటే బాగుండును. మళ్లీ తనూ ఫెయిలయాడుట చిన్నప్పుడు పరీ క్షలు. (సిగరెట్టు తీసి) తమ దగ్గిర అగ్గిపెట్టె వుందా ?

పంతులు : మన కింకా అగ్గిపెట్టెలు కూడా ఎందుకు? మా దబ్బాయి, ఇంక అధిక ప్రసంగం చెయ్యక నన్నాట్టే రెచ్చగొట్టకు——లేకపోతే...

అబ్బాయి : అదేమిటండి, అలా తప్పట్టు కుంటారు? పోనీ మీ దగ్గరలేకపోతే - ఏదో మర్యాదగా...

పంతులు : నువ్వు చేసిన మర్యాద చాలు.

అబ్బాయి : నన్నింక మీరేం క్షమిస్తారు? అన్నట్టు అగ్గిపెట్టె నా దగ్గరే వుండాలి. (సిగరెట్టు వెలిగిస్తాడు) ఈ హోరుగాలిలో...

నావవాడు : గంగా, ఇంక లాభంలేదురా, యీ తాడట్టుకో (తాడు విసురుతాడు నావ మీదికి). నేను తోసేసి ఎక్కుతాను. (తోస్తాడు) ఊఁ...హు. ఏలేయాల. ఏలే యాల. దీ - గెడింక తీసేసి తెడ్డు మెడ్డించు. (నావ కదలుతుంది. నావవాడు నీళ్ళల్లో కాళ్లు జాడించి ఎక్కుతాడు.)

పంతులు : యీ కోటిపల్లి దగ్గర గోదావరికో వంతెన కట్టించితే ఎంత బాగుండును!

అబ్బాయి: గోదావరి వంతెనంటున్నారు మీరు: మా నాన్నగారు పంచాయతీ బోర్డుతో హోరాహోరీని యుద్ధం చేస్తూ ఇప్పటికి మా యింటిముందున్న మురికి కాలవకి సిమెంటు చేయించలేకపోయారు.

పంతులు: భేష్. గోదావరి వంతెనకీ మీ యింట్లో మురుక్కాలవలకీ ముడెట్టావు నయంకాదూ—

అబ్బాయి: అదికాదండీ తాతగారు—

పంతులు: అదుగో, మళ్ళీ—

అబ్బాయి: అదే, ఇక్కడికి అయిదేళ్లనుంచి ఆలమూరుదగ్గర గోదావరిమీద వంతెనకట్టాలని ప్రభుత్వంవారు యోచిస్తున్నారు— ఇంతవరకు-

పంతులు: అవును సుమా—

నావవాడు: కూంతసే పూరుకోండయ్యా, బాబు, నావ నడి వరదలోకి పోతోంది. ఒరే గంగా, అలాగే మెడ్డించడం? అపట్టంలేదూ నావ వాలుకి లాగేత్తోంది. వోల్లదుగో, అద్దరిని ఆ సెట్టుకేసి పట్టేహేయ్.

అబ్బాయి: ఓహో. ఏం వడి! గంటకి అరవై మైళ్లుంటుం దేమో, ఇది.—వా డెవడో యీ మహాప్రవాహంలో ఎలా యీదుకుపోతున్నాడో!

గంగ: కొట్టుకొచ్చే పుల్లలకోసం యీ ఆవి దంతా పడాలి, బాబు.

అబ్బాయి: ఇదేం వాసన చెప్మా? ఇలా గుమాయిస్తోంది? నా సిగరెట్టుకి-

పంతులు: ఎన్ని వాసననూ నెలు రాసుకుంటే ఏంలాభం?

అబ్బాయి: మీరూ రాసుకున్నారా, వాసన నూనెలు?

పంతులు: ఏం నేనెందుకు రాసుకోకూడదు.

అబ్బాయి: ఎందుకు?

పంతులు: నా తలమీద-

అబ్బాయి: తలకి వాసననూనెలు రాసుకుంటే నల్లజుట్టూ, తెలివితేటలు మొలుస్తాయంటూరా?

పంతులు: అలాగని పేపర్లలో పబ్లిక్‌గా రాసినవాటిమాటో-

అబ్బాయి: ఏం సత్యకాలం! అవన్నీ నిజమనే.

పంతులు: అయితే పేపర్లలో అబద్ధాలు రాస్తారా?

అబ్బాయి: ప్రత్యేకం అబద్ధాలు కాక పోయినా వాళ్ళ సరుకు నాణ్యం వర్ణించు కోవడం—

పంతులు: ఏమో మరి.

అబ్బాయి: నేను క్రిందటి సెప్టెంబరు పరీక్షకి వెళ్ళినప్పుడు—

పంతులు: ఊఁహుఁ; ప్రవేశపడవు. క్రిందటి సెప్టెంబరుకి కూడా వెళ్లావూ.

అబ్బాయి: పునాది దిట్టం వుంటుందని—మా నాన్నగారు అది మా కస్తూరివారి ఇంట్లో ఆను మాయతి అని—

పంతులు. ఏమిటీ?

అబ్బాయి: అవునండి.

పంతులు: నువ్వు మా పరబ్రహ్మం కొడుకు వుటా? బాబూ, చెప్పేవుకావు.

అబ్బాయి: అవకాశం లేకపోయిందండి.

పంతులు: ఏమిటీ, నాకి మందమతి? నిన్నే ఆనమాలు పట్టలేకపోయాను!

అబ్బాయి: మరేనండి.

పంతులు: చూడు, బాబూ చిదంబరం—

అబ్బాయి: కాదు, నేను వెంకటేశ్వర్లునండి.

పంతులు: చూడు, వెంకటేశ్వర్లూ—

వెంక: అయ్యా- నేను సిగరెట్లు-

పంతులు: (నవ్వి) అబ్బే, అలా చెపుతానా? నేనసలు మీ యింటికే సుమా వెడుతూంట.

వెంక: మా యింటిముందు మురుక్కాలవ వుందన్నమాటే గానండి- మా నాన్న చాలా సంతోషిస్తాడండి.

పంతులు: రానాను లే- అయితే ముక్తేశ్వరం ఎంతసేపట్లో చేరతామంటావు?

వెంక: ముప్పావుగంటండి!

(నావ వడిగా పోతుంది.)